
6 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 7 ఏప్రిల్ 2025
www.ntnews.com

# చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలిసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



ఈ ఏటి జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత

## ఆర్భాటం లేని కవి..

# వీకే శుక్లా

Vinod Kumar Shukla

'కళకైనా, కవితకైనా పెద్ద ఆర్భాటమూ, ఆడంబరమూ ప్రదర్శనా అవసరం లేదు. ప్రచారమూ అవసరం లేదు. నిజానికి అద్దమూ అవే, కాంతీ అవే, బింబమూ అవే, ప్రతిబింబమూ అవే' సరిగ్గా ఈ మాటలకు అర్థం చెప్తూ ఆ భావాలను ప్రతిబింబిస్తూ వీకే శుక్లా రచనలు సాగుతాయి. అది కవిత్వమైనా, కథ అయినా, నవల అయినా అదే సింప్లిసిటీ, అదే సున్నితత్వం, అదే సరళత్వం. ఈ ఏటి జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికైన వీకే శుక్లా రచనలు సీదా సాదా రూపంలోనూ, గాఢమైన అనుభూతులతోనూ సాగుతూ తమదైన ప్రత్యేకతను సంతరించుకుంటాయి.

ఆయన రచనాశైలి వినూత్నంగానూ, సులభంగానూ ఉండి ఇట్లా అయితే మనమూ రాయొచ్చు అనిపిస్తుంది. కానీ, ఆ రచనల్లో అంతర్లీనంగా సాగే తాత్త్వికత అంత సులభంగా పట్టుబడేది కాదు. వినోద్‌కుమార్ శుక్లా ప్రసిద్ధ హిందీ కవి, నవలాకారుడు. అంతేకాదు, ఆయన చిన్న కథలూ రాశారు. మ్యాజిక్ రియలిజంకు సమీపంలో ఉండే ఆయన ప్రత్యేకమైన సృజనాత్మక శైలి దేశవ్యాప్తంగా విశేష ప్రశంసలను పొందింది. 1937, జనవరి 1న ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్‌లో జన్మించిన శుక్లాది సామాన్యమైన జీవితం. తాను ఎదుగుతూ, చదువుతూ రాస్తూ తనతో పాటు తన ఆలోచనా లోతులను తాత్త్విక దృక్పథాలను సంలీనం చేసి హిందీ సాహిత్యంలో విశేషమైన కృషిచేశారు. ఆయన రచనలు ఆధునిక హిందీ సాహిత్యంలో ఒక కొత్త దృక్కోణాన్ని పరిచయం చేశాయి.

ఆయన తొలి కవితా సంకలనం 'లగ్భగ్ జైహింద్' 1971లో ప్రచురితమైంది. ఇది మనిషి సాధారణ జీవిత సౌందర్యాన్ని కష్టాలను ప్రతిబింబిస్తుంది. ఆయన రాసిన ప్రసిద్ధ నవలల్లో నౌకర్ కీ కమీజ్‌ను సుప్రసిద్ధ దర్శకుడు మణికౌల్ సినిమాగా రూపొందించాడు. మరొక అద్భుతమైన రచన దీవార్ మే ఏక్ ఖిడ్కీ రహతీ థీ (గోడలో ఒక కిటికీ ఉండేది) 1999లో సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నది. ఛత్తీస్‌గఢ్ నుంచి జ్ఞానపీఠ్ అవార్డుకు ఎంపికైన మొదటి రచయితగా నిలిచారు. శుక్లా రచనా శైలి విలక్షణమైంది.

అందులో introspective, imaginative లక్షణాలు ఉండి, సాధారణ క్షణాలను విశ్వ సత్యాలుగా మారుస్తాయి. ఆయన రచనలు మనిషి వ్యక్తిత్వాన్ని, చుట్టూ ఉండే మనుషులను పాత్రలుగా చేసుకొని జీవన తాత్త్వికలను అంశాలను ఆవిష్కరిస్తాయి. ఆ రచనలు పాఠకులను లోతుగా ఆకట్టుకుంటాయి. ఆయన కవితలు, కథలు సాధారణ మనిషి జీవితంలోని సూక్ష్మతలను సులభమైన భాషలో ఆవిష్కరిస్తాయి. వీకే శుక్లా రచనలు సాధారణ మనుషుల భావాలను, వారి దైనందిన జీవితాన్ని, సమాజంలోని సంక్లిష్టతలను అందంగా వ్యక్తపరుస్తాయి.

వినోద్‌కుమార్ శుక్లాను సమకాలీన హిందీ సాహిత్యాన్ని 'సింహిక' అని పిలుస్తారు. స్వభావంలో నిశ్శబ్దంగా, ప్రవర్తనలో మృదువుగానూ అస్పష్టంగానూ ఉండి, పాఠకుల్లో చాలామందికి అంతుపట్టని చిక్కు ప్రశ్నగా మిగిలిపోతాడు. ఒంటరితనాన్ని ఇష్టపడే శుక్లా తన రచనా ప్రేరణ కోసం చిన్న పట్టణాల బజార్లు, వాటి పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ, వర్షం నీటిని తప్పించుకుంటూ, రైల్వే స్టేషన్‌లో లేదా బస్‌స్టాప్ వద్ద నిరీక్షిస్తూ జీవితాన్ని పరిశీలిస్తాడు, ఆలోచన చేస్తాడు. ఆయన అనేక ప్రశ్నలు సంధిస్తాడు సమయానికి ధ్వని ఏమిటి? ప్రేమకు వాసన ఎలా ఉంటుంది? ఇట్లా అనేక ప్రశ్నలను సంధిస్తూ తన రచనల్లో పొందుపరుస్తాడు. అంతేకాదు కొత్త వ్యాకరణాన్ని ఆవిష్కరిస్తాడు.

తనకు అవార్డు వచ్చిన తర్వాత శుక్లా స్పందిస్తూ... 'నేను జీవితంలో ఎంతో చూశాను, ఎంతో విన్నాను, ఎంతో అనుభవించాను కానీ, కేవలం కొంచమే రాయగలిగాను. నేను ఎంతో రాయాల్సి ఉందని, ఇంకా చాలా మిగిలి ఉందని అనిపిస్తోంది' అన్నారు. నేను న్నంత కాలం, మిగిలిన రచనలను పూర్తి చేయాలని ఆశిస్తున్నాను, కానీ, నా పని పూర్తిచేయగలిగే అవకాశం తక్కువ.

ఈ కారణంగా, నేను ఒక పెద్ద సందిగ్ధంలో పడిపోయాను. నా జీవితాన్ని నా రచనల ద్వారా కొనసాగించాలనుకుంటున్నాను. కానీ, నా జీవితం త్వరితంగా ముగింపు వైపుకు చేరుకుంటున్నది. నేనే ఆ వేగంతో రాయలేను, అందువల్ల కొంతవరకు విచారంగా కూడా ఉంది' అని ఆయన అన్నారు. 'ఈ అవార్డు నాకు చాలా తియ్యనిది అని కూడా నేను చెప్పలేను, ఎందుకంటే నాకు మధుమేహం ఉంది' అని ఆయన చమత్కరించారు.



### బజార్‌లో ఒక వీధి


బజార్‌లోని ఒక దారిలో...
బిజీగా వున్న కొనుగోలుదారు,
చేతిలో రెండు సంచులు పట్టుకున్నాడు
ఒకటి చినిగినది, మురికితో నిండింది

ఒకటి ఖాళీ,
మరొకటి నిండి ఉంది.
సంచిలో బంగాళా దుంపలు,
ఆకు కూరలు,
గరం మసాలా పాకెట్, మిరపకాయలు
ఎరుపు, పచ్చల రంగుల కాంతులతో
తాజా తాజాగా వున్నాయి.

నేనో పది రూపాయల నోటుగా మారి,
ఆ సంచిలో సేదదీరితే
ఎంత బాగుండేది.
అని ఎంతగానో అనుకున్నాను,

కానీ నేనూ...
నా సొంత సంచిలోనే చిక్కుకుపోయాను.

హిందీ మూలం: వినోద్ కుమార్ శుక్లా
ఇంగ్లీష్: డేనియల్ వేయిబోర్ట్‌తో కలిసి కవి
స్వేచ్ఛానువాదం: వారాల ఆనంద్




వారాల ఆనంద్, 94405 01281

# పచ్చదనంపై పైశాచికమా?

కూలుతున్న చెట్ల మధ్య నెమళ్ల, జింకల ఆర్తనాదాలు. గూడు కూలిన పిట్టలు చెల్లాచెదురైన బీభత్స భయానక దృశ్యం. పచ్చదనానికి బుల్డోజర్ల చెదలు. జేసీబీ చక్రాల ఉక్కుపట్టీల్లో చిక్కుకున్న జింకపిల్ల కళేబరం సాక్షిగా జరుగుతున్న ప్రకృతి హననం. పర్యావరణ విధ్వంసం. నగరం మధ్యలో వెలుగుతున్న ఆకుపచ్చని దీపాన్ని ఆర్పాలన్న సర్కారు ఆత్రం. నగరజీవికి కాలుష్యం నుంచి ఊరటనిచ్చే ఆకుపచ్చని ఊపిరితిత్తులను ఛిద్రం చేయాలని దూకుడు. చిన్న మొక్కయిన నాటని చేతులు పెద్ద అడవినే పెరికి కుప్పలు పోస్తున్నాయి. హరితావరణంపైకి గొడ్డళ్లు విసురుతున్నాయి. దివాళాకోరు భూమి అమ్మకాల కోసం దిక్కుమాలిన వేలానికి ఉరుకులాడుతున్న సర్కారుపై కలాల గర్జన... న్యాయస్థానం చెర్నాకోల చరుపులతో బుల్డోజర్లలో తర్జనభర్జన...

### ధనుష్టంకారం

నా మెలకువ నెమళ్ల ఆట
నా కల.. జింకల తోట
గడ్డిపరకా మహావృక్షం పిట్టపాటా
తల్లి హరితాంబర చేలాంచలాలతో
బిడ్డల దోబూచులాట
అక్షరం కడుపులో నేను
అక్షరం చుట్టూ అడవి
నేను విద్యారణ్యంలో గిరిజనుణ్ణి
హఠాత్తుగా అర్ధరాత్రి నా కుటీరంలోకి
జేసీబీల వేషంలో డజన్ల కొద్దీ యుద్ధట్యాంకర్లు
శత్రుదేశంలోకి చొరబడినట్లుగా దురాక్రమణ దాడి
ప్రాణాలు కాపాడుకోవడానికి ఎటుపోలేక
చెట్టూ పుట్టా ఆక్రందనలు.. నెత్తురోడే నెమళ్ల క్రేంకారాలు
యుద్ధం నాతో కాదట... చెట్లతో నట
యుద్ధం నాతో కాదట.. నా హరిత స్వప్నంతో నట
కావాల్సింది నేను కాదట
నేను నిలబడిన నేలంట
నాకు తెలుసీ విధ్వంస క్రతువు దేనికోసమో
లాఠీ జేసీబీ తంత్రాల ఆంతర్యమేమిటో
మీ చీకటి కుతంత్రాల్ని ధిక్కరించే మానవ వృక్షాన్ని నేను
లాఠీలతో బాదినా, బూటు కాళ్లతో తొక్కినా
మీరు నేల కూల్చిన చెట్లు మనుషులై లేచినట్లు
మీ యుద్ధ శకటాలను ముట్టడించి ధర్నా చేస్తాను
నోరులేని చెట్లు చేసే నినాదాన్నవుతాను
చెట్టూ నేలా నేనై పిడికిలి బిగిస్తాను
అడవి గర్జనలు ప్రతిధ్వనిస్తాను
జమ్మిచెట్టు సాక్షిగా
నగరారణ్యంలో ఆదివాసినై ధనుష్టంకారం చేస్తాను.



వసీరా



సుధా మురళి

చిలక్కొట్టిన
జాంపండు తిన్న రక్తం నాది
అందుకే అడవంటే
అంత మోజు

కోకిల కూతకు
గొంతు కలిపిన స్వరం నాది
కనుకనే పక్షులన్నా వాటి
అరుపులన్నా అంత ఇష్టం

నెమలి నాట్యాన్ని
జింకల పరుగుల్ని
కుందేళ్ళ హొయలను
అనుకరించి నేర్చినవి
నా నడకలు
వాటి పరుగులెప్పుడూ
చెట్టూ పుట్టల వెంటే

ఇంచు ఇంచూ
అందమొలికిన ఆ చోటన
ఇప్పుడు నిప్పు నిప్పుగా నొప్పి
కురుస్తోంది
అన్ని కాలాల్లోనూ
ఆమని పూసిన ఆ నేలలో
ఈ కాని కాలం కాష్టాన్ని
రగిలిస్తోంది

నేను విన్న
నేను కన్న
కథల్లోని కూనలన్నీ
కన్నీళ్లకు ఆరని మంటల్లో
కాలిపోతున్నాయి

నేను పీల్చిన గాలే బూడిదై
నన్ను కమ్మేస్తోంది
నేను తాగిన నీరే ఆవిరై
నన్ను తాగేస్తోంది

ఇప్పుడు మాత్రం వేదనను
నేను పలికించగలను
ఏ చరిత నివేదనను
నేను వినిపించగలను

బిగించిన పిడికిలి నిండా
ఊపిరి ఆడని లోకాన్ని
చుట్టబెట్టి
అగ్గి రగిలించిన
ఒక్కో ప్రాణాన్ని పిగిలి పిగిలి
పొమ్మని శపించడం తప్ప
ఇప్పుడు ఏ దుఃఖాన్నని నేను
మోయగలను

ఊరవతలి శ్మశానం
నగరపు నడిబొడ్డుకు తరలి
వచ్చేస్తోంటే
నగరమంతా శవాలవ్వబోయే
మనుషులతో నిండిపోతుంటే
ఇప్పుడు ఏ ఆర్ద్ర గీతాలకు
స్వరాలను జత చేయగలను
అభివృద్ధి మందు వేసుకున్న
రాజ్యం ప్రాణం
అంపశయ్య మీద రోజులు
లెక్కబెడుతున్న ఈ దినాన
బూడిదవ్వక మిగిలున్న
ఏ ఊళ్లో నా ప్రాణాల్ని
బంధించను

సూర్యోదయాలు
సూర్యాస్తమయాల నిండా
గుంపులు కట్టిన కొంగల
విహారాల రెక్కలు తెగి
పడుతుంటే
ఏ పచ్చని ప్రపంచానికై
కలను కనమని కళ్లను పోరు
పెట్టను


ఇంతటి
శూన్యాన్ని
ఏ కాంక్షల కొన ఊపిరితో
నింపను
ఈ మహా
దైన్యాన్ని
ఎవ్వరి నెత్తురుతో చల్లార్చను

### పర్యావరణ దుఃఖం

వేల ఏండ్ల క్రితమెప్పుడో!
అందమైన ఆకులతో
రంగురంగుల పూల పరిమళాలతో
భూమ్యాకాశాల సహజసంకేతమై
ఈ మట్టిలోంచి మొలకెత్తిన
పురాతన మహావృక్షం

ఎండావాన ఉరుముల్లో
సుడిగాలుల తుపానుల్లో
ఎముకలు కొరికే చలిలో
తన కొమ్మల్ని రక్షించుకునే
సహజ రక్షణకవచధారి

రకరకాల పక్షులకు గూడై
బాటసారులకీ చల్లని నీడై
ఆకలితో ఉన్నోళ్ళకు పండై
ప్రతిఫలం ఆశించని ప్రకృతి
ఈ భూమితో పెనవేసుకున్న పేగు బంధం



ఇప్పుడెవరో!
సూర్యుని మీద కాలుష్యం మబ్బుల్తో
కిరణజన్య సంయోగ క్రియను ఆపే
కుట్ర జరుపుతున్నట్టు
ఏదో నిశ్శబ్ద అలజడి

అకస్మాత్తుగా...
ఆకులన్నీ ఒక్కొక్కటిగా
రాలిపడుతున్న శబ్దం
కొమ్మలు పెళపెళమని
విరిగి కలవరపెడుతున్న
భయానక వాతావరణం
గూళ్లు వదల్లేని పక్షులు
రెక్కలల్లార్చుతూ..
ఎగిరిపోతున్న సమూహ దుఃఖం

ముఖాన ముసుగుల్తో
భుజాన అదృశ్యాయుధాలతో
వడివడిగా వస్తున్న ఆగంతకులు
మసకమసకగా కన్నీటి పొరల వెనుక
కన్పిస్తున్న దుఃఖ దృశ్యం
వృక్ష అస్తిత్వానికి ప్రమాద సంకేతంలా
కీచురాళ్ళ విషాదగానం

ఇక.. ఇప్పుడు
ఎడారులైన భూమి పొరల్లో
నీటి చెలిమెల్ని వెతుక్కుంటూ
విస్తరిస్తున్న వేర్లు
చిటారు కొమ్మల చిగుర్లని బతికించుకొని
పాపలకు పాలిచ్చే అమ్మలా
ప్రపంచానికి ప్రాణవాయువును
పంచుతున్న వృక్షమాత..



డాక్టర్ బాణాల శ్రీనివాసరావు
94404 71423

### గ్రీన్ లంగ్స్ ఆఫ్ హైదరాబాద్

చదువుల తల్లికి
దండం పెట్టాల్సినవారు
పిండం పెడుతుండ్రు
ప్రజాపాలన కృతఘ్నత

భూమి జాతీయసంపద
తాకట్టుకు విలాసాలకు వెంచర్లకు
ఆట వస్తువు కాదు
అందాల పోటీల వ్యాపారం అసలే కాదు
విజ్ఞాన చంద్రికల చదువుల ఒడి
దేశ విదేశాల వలస పక్షులు
విజ్ఞానార్జనకై వాలే జ్ఞానతోట

భూమి బిడ్డలు తీవ్రవాదులు కారు
జ్ఞానకెరటాలు
తమ గుండెను కోస్తున్నప్పుడు
ప్రతిఘటించడం జన్మహక్కు
విశ్వవిద్యాలయ విద్యార్థులు
సమాజపు దివిటీలు ఆశయాల
వెలుగులు

ఇందిరమ్మ ఉట్టిగనే దానమియ్యలే
సిక్స్ పాయింట్ ఫార్ములా కింద
అరవై తొమ్మిది తెలంగాణ ఉద్యమం
జై ఆంధ్ర ఉద్యమం
సంఘర్షణల తొలి ఫలితమే
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

హరిణాలను పశుపక్ష్యాదులను
వన్యజీవులను నేలమట్టం చేసే
పర్యావరణ విధ్వంస ప్రతిఘాతుకం
నగరీకరణ పేరున
ఆకుపచ్చటి శ్వాసకోశల భాగ్యనగరంపై
బుల్డోజర్ల దండయాత్రలు

బువ్వ పెట్టినందుకు
బతుకునిచ్చినందుకు
రాజకీయ అధికారాన్నిచ్చిన 'ధరణి'ని
అమ్ముకోవడం
జన్మనిచ్చిన తల్లిని వంచించటమే!
దశాబ్దాల స్వాతంత్ర్య చరిత్ర

రజతోత్సవాలు, స్వర్ణోత్సవాలు,
వజ్రోత్సవాలు, అమృతోత్సవాలు
భవిష్య శతోత్సవాల సంబురాలపై
ప్రజాపాలన కండ్ల మంటలు
ఆకుపచ్చని ఆకులపై కుబుసాలు

అవనిపై
రక్తపుటేరులు కాదు పూలు పూయించు
విశ్వవ్యాప్తమై పరిమళిస్తాయి
చెట్లను పెంచు
పర్యావరణ హితమై
హరితవర్ణమవుతుంది
అక్షరాల మొక్కలు నాటు
జ్ఞానబోధులై దారిని చూపుత



వనపట్ల సుబ్బయ్య
94927 65358

ప్రకటనలు

### సాహితీ పురస్కారం

తెలుగు విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యులు డాక్టర్ చెన్నకేశవ రెడ్డి ఏటా తన జన్మదినం రోజున అందజేసే పురస్కారాన్ని ఈ ఏడాది సుప్రసిద్ధ కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డికి బహూకరించనున్నారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి సమావేశ మందిరంలో బహుకరణ జరుగనున్నది. జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక నిర్వహించే ఈ సభకు డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షత వహిస్తారు. ఆచార్య అనుమాండ్ల భూమయ్య ముఖ్య అతిథిగా పాల్గొంటారు. డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, డాక్టర్ నాళేశ్వరం శంకరం విశిష్ట అతిథులుగా హాజరుకానుండగా, ఎం.కె. రాము, ఆచార్య ఎం. శంకర్ రెడ్డి, డా. పి.లక్ష్మీనారాయణ, డా.తూర్పు మల్లారెడ్డి, చీకోలు సుందరయ్య, డా. గంటా జలంధర్ రెడ్డి ఆత్మీయ అతిథులుగా పాల్గొననున్నారు.

- డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌రావు

### ఆవిష్కరణ సభ

2025, ఏప్రిల్ 13వ తేదీ ఉదయం 10.30 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమురయ్య హాల్‌లో ఆవంచ ప్రమోద్ రాసిన 'మేలిమి చింత' కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరుగనున్నది. కవి యాకూబ్ అధ్యక్షత వహిస్తారు. సుంకిరెడ్డి నారాయణరెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. ఎన్.వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. రావూరి చంద్రశేఖర్ రెడ్డి (మాజీ ఎంపీ) విశిష్ట అతిథిగా పాల్గొంటారు. డాక్టర్ రూప్‌కుమార్ డబ్బీకార్, కాసుల ప్రతాప్ రెడ్డి, కందుకూరి అంజయ్య, చల్లా రామఫణి, గాజోజు నాగభూషణం, వేదాంత సూరి తదితరులు హాజరుకానున్నారు.

-పాలపిట్ట బుక్స్, 9848787284